

ఇన్‌చార్జి డీఆర్వో బదిలీ

పార్వతీపురం, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడుకు బదిలీ అయ్యింది. అనంతపురం ఆర్డీవోగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా పాలకొండ ఆర్డీవో వీవీ రమణను నర్సీపట్నం ఆర్డీవోగా నియమించారు. ● గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మంథ కృష్ణను సరెండర్ చేస్తూ.. శుక్రవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఆయన పనితీరు సంతృప్తికరంగా లేదని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

అసలే అరకొర.. ఆపై లీకులు

- ఇదీ జిల్లా కేంద్రంలో పరిస్థితి
- తాగునీటి సరఫరాతో పాటు పైప్‌లైన్ల లీకుల సమస్య జటిలం
- కలుషిత నీటితో ప్రజలకు తప్పని అవస్థలు
- తరచూ రోగాలతో సతమతం
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విన్నపం



ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకవుతున్న దృశ్యం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 27:

జిల్లా కేంద్రంలో తాగునీటి సరఫరాతో పాటు లీకుల సమస్య తీవ్రమైంది. ఎప్పుడో 60 ఏళ్ల కిందట వేసిన పైప్‌లైన్లు నేడు పూర్తిగా పాడయ్యాయి. దీంతో 30 వార్డుల్లో ప్రజలకు అరకొరగానే తాగునీరు సరఫరా అవుతోంది. మరోవైపు పైప్‌లైన్ లీకుల కారణంగా కలుషిత నీరే వారు తాగాల్సి వస్తోంది. వాస్తవంగా పదేళ్లకిందట వరకు కనీసం రోజు తప్పించి రోజు తాగునీటి సరఫరా అయ్యేది. అయితే గత ఐదేళ్లుగా మూడు నుంచి నాలుగు రోజుల కొకసారే కొళాయిల ద్వారా నీరు సరఫరా అవుతోంది. మరోవైపు ప్రధాన పైప్‌లైన్‌కు ఎక్కడ లీకుల కారణంగా నీరు వృథాగా పోతోంది. ఇదే సమయంలో నీరు కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై జిల్లాకేంద్రవాసులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లా కేంద్రం రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణ జనాభా పెరుగుతున్నారు. అయితే అందుకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా జరగడం లేదు. వాస్తవంగా జిల్లా కేంద్రానికి సుమారు 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న నాగావళి నది వద్ద హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్రజలకు తాగునీటి సరఫరా అవుతుంది. అయితే కాలం చెల్లించిన పైప్‌లైన్‌ను మార్చకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అన్ని కాలాల్లోనూ రెండు, మూడు రోజులకొకసారే తాగునీరు సరఫరా అవుతుండగా.. దీనికి పైప్‌లైన్ లీకుల సమస్య కూడా తోడైంది.
- అప్పట్లో పట్టణ ప్రధాన రహదారికి అనుకొని పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే 2004లో ప్రధాన రహదారి విస్తరణ జరిగింది. దీంతో పైప్‌లైన్ ఎప్పటికప్పుడు లీకులు ఏర్పడుతున్నాయి. ఇదే దారిలో భారీ వాహనాలు వెళ్తుండడంతో లీకుల సమస్య జటిలమవుతోంది.
- కలుషిత నీటినే వినియోగిస్తుండడంతో ప్రజలు తరచూ డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిసే సమయంలో అయితే కొళాయిల నుంచి బురదతో రంగు మారిన నీరే వస్తుందని వార్డు ప్రజలు వాపోతున్నారు. పైప్‌లైను లీకులను అరికట్టి సురక్షిత నీటిని అందించాలని వేడుకున్నా.. అధికారులు స్పందించకపోవడంపై జిల్లాకేంద్ర వాసులు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.
- జిల్లా కేంద్ర ప్రజల దాహార్తి తీర్చేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు రూ.36 కోట్లతో తాగునీటి పైలట్ ప్రాజెక్టు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే 2019 తర్వాత పరిస్థితి మారింది. వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ పనులకు బ్రేక్ పడింది.
- తాగునీటి సరఫరాకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఎంతో అట్టహాసంగా రూ.66 కోట్లతో పైలట్ ప్రాజెక్టుకు శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అయితే పనులకు సంబంధించి నిధులు విడుదల చేయలేదు. దీంతో తాగునీటి సరఫరాతో, లీకుల సమస్య యథాతథంగా కొనసాగుతుండడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న తాగునీటి పైలట్ ప్రాజెక్టు శిలాఫలకం



బైపాస్ రోడ్డులో ఇలా..

రోగాల బారిన పడుతున్నాం..

పైప్‌లైన్ లీకుల వల్ల కొళాయిల ద్వారా కలుషిత నీరే వస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే వాడుతుండడం వల్ల తరచూ రోగాల బారిన పడుతున్నాం. ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

-ఎం.సత్యనారాయణ, పార్వతీపురం

లీకులు అరికట్టాలి..

తాగునీరు కలుషితం కాకుండా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. పైప్‌లైన్ లీక్‌లను అరికట్టి ప్రజారోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత వారిపైనే ఉంది.

-జీవీ దుర్గారావు, పార్వతీపురం

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం..

తాగునీటి సరఫరాతో పాటు లీకులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేశాం. పైప్‌లైను లీకులపై దృష్టి పెట్టాలని ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించాం. ప్రజారోగ్యంపై ఎప్పుడు అప్రమత్తంగా ఉంటాం.

-కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

సురక్షిత నీటిని అందించండి

బెలగాం, సెప్టెంబరు 27: పార్వతీపురం పట్టణంలో తాగునీటి కష్టాలు తీర్చి, సురక్షిత నీటిని అందించాలని జిల్లాకేంద్రవాసులు, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. వారు చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం మూడో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఐద్వా ప్రతినిధులు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతోనే పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. రోజూ సురక్షిత నీటిని ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారం కోసం అక్టోబరు 1న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తాగునీటి సమస్యపై ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.ఇందిరా, తులసి, గౌరి సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, సూరిబాబు, రాజశేఖర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో మాట్లాడుతున్న ఐద్వా ప్రతినిధులు

తహసీల్దార్లకు స్థానచలనం

పార్వతీపురం, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లకు బదిలీ అయ్యింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లా నుంచి వస్తున్న తహసీల్దార్ కె.జయకు కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.శివన్నారాయణ గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా రానున్నారు. సీతానగరం తహసీల్దార్ రాములమ్మను విజయనగరం బదిలీ చేశారు. ఆ స్థానంలో విజయనగరం జిల్లాకు చెందిన కె.ప్రసన్న కుమార్‌ను నియమించారు. పార్వతీపురం కలెక్టరేట్ ఏవో ఎం.సావిత్రికి పాలకొండ సబ్ కలెక్టర్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వస్తున్న పి.బాలకు గరుగుబిల్లి తహసీల్దార్‌గా నియమించారు. ఇంతరవరకు అక్కడ పనిచేసిన వై.జయలక్ష్మిని పార్వతీపురానికి బదిలీ చేశారు. గరుగుబిల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్‌ను కలెక్టరేట్ ప్రత్యేక ఉప తహసీల్దార్‌గా నియమించారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా నుంచి బి.సుందరరావును ఉప తహసీల్దార్‌గా వస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ ఎస్.అప్పారావు భామినికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా జిల్లాలోని వివిధ మండలాలకు డిప్యూటీ తహసీల్దార్లను నియమించారు.

కోటదుర్గమ్మ ఉత్సవాలపై నిరంతర పర్యవేక్షణ

- ఎస్పీ మాధవరెడ్డి



కోటదుర్గమ్మ ఆలయంలో ఎస్పీ తదితరులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోట దుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాలపై నిరంతర పర్యవేక్షణ, నిఘా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ఆయనకు ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకుడు లక్ష్మీ ప్రసాదశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ఎస్పీ ఆరా తీశారు. అంశాల వారీగా ఈవోను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్ర మౌళిని ఆదేశించారు. అనంతరం పాలకొండ ఆర్డీవో కార్యాలయం పక్కన పోలీస్ సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో టీడీపీ నాయకులు సంతోష్‌కుమార్, రుద్ర కోటేశ్వరరావు తదితరులున్నారు.

22 మంది సభ్యులతో ఉత్సవ కమిటీ

కోటదుర్గమ్మ ఆలయం ప్రాంగణంలో శుక్రవారం 22 మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా గార దుర్గారావు, సభ్యులుగా ఎస్.రుద్ర కోటేశ్వరుడు, వెంకట రమణ, వరప్రసాద్ గుప్తా, శ్రీనివాసరావు, లక్ష్మీమూర్తి, రవి, వెంకటరమణ, రమేష్, వెంకటరమణ, వి.సంతోష్‌కుమార్, భాస్కరరావు, చిట్టిబాబు, సాయికుమార్, శంకరరావు, లోకనాథ చౌదరి, కె.భీమారావు, ఎం.సంతోష్‌కుమార్, పి.సంతోష్, ఎం.రామినాయుడు, కె.కుమార్‌రాజా, బి.సుధాకర్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పనులు వేగవంతం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ



ఏకలవ్య పాఠశాల పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కురుపాం/గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు27: కురుపాంలో ఏకలవ్య పాఠశాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. శుక్రవారం భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకా చేయాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడరాదని గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఏఈ అప్పారావుకు సూచించారు. అనంతరం ఆయన గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలించారు. పక్కాగా మెనూ అమలు చేయాలని, సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. యూత్ ట్రైనింగ్ నిర్వహణ గురించి అడిగి తెలుసు కున్నారు. గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీవో

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- ఇన్‌చార్జి డీపీవో రామచంద్రరావు

భామిని: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఇన్‌చార్జి డీపీవో రామచంద్రరావు అన్నారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం భామిని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశమయ్యారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ఎస్‌డబ్ల్యూపీసీ, పంచాయతీ రికార్డుల నిర్వహణపై పంచాయతీల వారీగా సమీక్షించారు. మండలంలో 44 వాటర్ ట్యాంకులు ఉంటే 21 ట్యాంకులనే పరిశుభ్రం చేసినట్టు నమోదవడంపై ఇన్‌చార్జి డీపీవో మండిపడ్డారు. మిగతా 23 ట్యాంకులను ఎందుకు శుభ్రం చేయలేదని కార్యదర్శులను నిలదీశారు. తాము క్లీన్ చేసినా వెబ్‌సైట్‌లో నమోదు కావడం లేదని వారు బదులిచ్చారు. ఈ విషయంపై టెక్నీషియన్‌కు సంప్రదించారా..? సమాచారం కార్యాలయానికి అందజేశారా.. లేదా అని ఇన్‌చార్జి డీపీవో ప్రశ్నించారు. తక్షణమే జిల్లాకేంద్రానికి రావాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద యూనిట్ల పరిస్థితులపై పంచాయతీ వారీగా ఆరా తీశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణపై ప్రశ్నించారు. అయితే సిబ్బంది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లోగా 15వ ఆర్థిక సంఘం రికార్డుల ఓచరు ఉండాలని ఈవోఆర్డీ కృష్ణారావును ఆదేశించారు. ఎంపీడీవో, ఈవో ఆర్డీ పర్యవేక్షణ లోపంపై అసహనం వ్యక్తం చేశారు.

పర్యాటక సందడి

- సీతంపేటలో ఘనంగా పర్యాటక దినోత్సవం
- ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్న గిరిజనులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



థింసా నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం సీతంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, డప్పులతో గిరిజనులు సందడి చేశారు. విద్యార్థులు థింసా, నెమలి తదితర నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కాగా ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేసిన ఆడలి వ్యూ పాయింట్, రాత్రి వేళల్లో సందర్శకులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన టెంట్‌హౌస్, క్యాంటీన్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. టెంట్‌హౌస్‌లో కూర్చొని ప్రకృతి రమణీయతను ఆస్వాదించారు. ఆ తర్వాత వారు ఎస్పీ మాధవ రెడ్డితో కలిసి జీసీసీ, ఆర్ట్స్, సవర చిత్ర కళలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాలను పరిశీలించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. 'సందర్శకుల కోసం ఆడలి వ్యూ పాయింట్‌లో టెలిస్కోప్ ఏర్పాటు చేస్తాం. ఆసక్తి కలిగిన యువత కోసం ట్రెక్కింగ్ చేసుకోవడానికి సన్నాహాలు చేస్తాం. సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌ను ప్రభుత్వ లేక ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తాం. వచ్చే ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం నాటికి పర్యాటకుల కోసం బెన్నరాయి వాటర్ ఫాల్స్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేస్తాం. సీతంపేటలో రూ.4 కోట్లతో గిరిజన మ్యూజియం, రూ.27 కోట్లతో జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు మరిన్ని ప్రదేశాలను గుర్తించాం. ఆడలి వ్యూ పాయింట్‌లో ఉండేందుకు ఆన్‌లైన్ బుకింగ్స్ చేసుకోవొచ్చు.' అని కలెక్టర్ తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సీతంపేట ఏజెన్సీతో పాటు భామిని మండలంలోని పర్యాటక ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని కలెక్టర్‌ను కోరారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పర్యాటక ప్రాంతాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో చినబాబు, పాల కొండ డీఎస్పీ రాంబాబు, టూరిజం అధికారి నారాయణరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆడలి వ్యూ పాయింట్ వద్ద కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, ఎమ్మెల్యే తదితరులు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రకృతి అందాలతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో సాహసోపేతమైన క్రీడలు, పారా మోటారింగ్, 5డీ థియేటర్, ఐ లవ్ సీతంపేట పేరుతో నిర్మించిన ఫొటో షూట్ ప్రదేశాన్ని ప్రారంభించారు. 5డీ థియేటర్‌లో మూవీని వీక్షించారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా పార్క్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ముఖ్యంగా టీవీ కళాకారుల బృంద సభ్యులు పల్సర్ బైక్ ఝాన్సీ, శాంతికుమార్, రాజమౌళి, డాన్స్ మాస్టార్ రమేష్‌ల ప్రదర్శనలు ఆద్యంతం నవ్వులు పూయించాయి. గిరిజన విద్యార్థినుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. హడ్డుబంగి, సీతంపేట ఆశ్రమ పాఠశాల బాలికల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన గిరిజన విద్యార్థులకు కలెక్టర్ మెమెంటోలను అందజేశారు.

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు



కొరటాల శివ

'మా అందరి నాలుగేళ్ల కష్టమే 'దేవర' చిత్రం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ఇస్తున్న రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లకు ధన్యవాదాలు. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. 'దేవర' కోసం దర్శకుడు కొరటాల శివ చాలా కష్టపడ్డారు. ఎన్టీఆర్ ఇరగదీశాడు. తను వన్ మ్యాన్ షో చేశాడు. నాకెంతో గర్వంగా ఉంది' అన్నారు కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో ఆయన నిర్మించిన 'దేవర' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత కొరటాల శివ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టం 'దేవర'. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌లకు ధన్యవాదాలు. చివరి నిముషం వరకూ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇంత పెద్ద విజయం దక్కింది' అన్నారు. 'దేవర' చిత్రాన్ని తెలంగాణలో విడుదల చేసిన దిల్ రాజు మాట్లాడుతూ ' స్టార్ హీరో సినిమా రిలీజ్ అనగానే పండగ వాతావరణం ఉంటుంది. నేను రాత్రి సినిమా చూశా. ఈ చిత్రం ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం ఎన్టీఆరే. వన్ మ్యాన్ షోతో సినిమాను నిలబెట్టారు' అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

'ఢిల్లీలో మీ స్నేహితులు...' అనకుండా ఉండాల్సింది'

- ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం నాకు అర్థమైంది - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



'ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో పెట్టిన ఓ పోస్ట్‌లో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి... కేంద్రంలోని మీ స్నేహితులకు ధన్యవాదాలు' అని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయడం దుమారం రేపింది. దీనిపై తాజా ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో నేను స్పందిస్తే... 'ఢిల్లీలో మీ స్నేహితులు...' అంటూ కామెంట్ చేయాల్సిన అవసరం ప్రకాశ్‌రాజ్‌కు లేదు. ఆయన పోస్ట్‌ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని చెప్పారు. 'ప్రకాశ్‌రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా దారులు వేరైనా మా మధ్యన ఒకరంటే ఒకరికి గౌరవం ఉంది. ఆయనతో కలసి పనిచేయడం ఇష్టం' అని కూడా పవన్ చెప్పారు.


మనకేం కావాలి.... ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్

తిరుపతి లడ్డూ కల్తీ వివాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ శుక్రవారం మరోసారి సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగారు. అందులో 'మనకేం కావాలి... ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి... తద్వారా రాజకీయ లబ్ధిని సాధించడమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా...పరిపాలనా సంబంధమైన... అవసరమైన తీవ్రమైన చర్యలతో... సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవడమా?' అంటూ పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించకుండా ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు.

మూల్యం చెల్లించుకోకతప్పదు - ఖుష్బూ

లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. తిరుమల లడ్డూను కల్తీ చేసినవాళ్లు ఎవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. 'ఆ వేంకటేశ్వర స్వామి అంతా చూస్తున్నాడు. లడ్డూను కల్తీ చేయడం అంటే కోట్లాది మంది ప్రజల విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతీయడమే. అని ఖుష్బూ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం శనివారం • 28 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com



వంద రోజుల్లో విజయాలెన్నో...

ఆరు హిట్స్... అనేక ఫ్లాపులతో చిత్రసీమ ప్రథమార్థాన్ని ముగించింది. అతి కీలకమైన ద్వితీయార్థంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో.. భారీ చిత్రాలు అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే మూడు నెలలు ముగిశాయి. ఇక ఉన్నది మూడు నెలలే.. ఈ మూడు నెలల్లో అరడజను భారీ చిత్రాలు క్యూలో ఉండటం విశేషం. వాటిలో అలరించేవి ఎన్ని.. చరిత్ర సృష్టించేవి ఏవి.. అంచనాలను తారుమారు చేసేవి ఎన్నో తెలియాలంటే ఏడాదిలోని ఆఖరి వారం వరకూ వేచి చూడాల్సిందే.

పుష్పరాజ్ కోసం ఎదురుచూపులు

2021లో విడుదలైన 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఏ రేంజ్‌లో సత్తా చాటిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని దర్శకుడు



సుకుమార్ మంచి హైప్‌తో క్లైమాక్స్‌ను ముగించారు. మొదటి భాగానికి మించిన హిట్ కొట్టాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సీక్వెల్‌ను చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్‌గా అందరినీ అలరించిన అల్లుఅర్జున్.. రెండో భాగం 'పుష్ప:ద రూల్'లో ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని అభిమానులు ఆసక్తిగా కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

గేమ్ చేంజర్‌గా...

రామ్‌చరణ్, డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న మాగ్నమ్ ఆపస్ ఎంటర్టైనర్ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అందులో ఒక పాత్ర అవినీతితో పోరాటం చేస్తుందని సమాచారం. ఈ సినిమాపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

దసరాకి వేట మొదలు

'జై భీమ్' ఫేమ్ టీ.జే.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమి





తాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజువారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. రజనీకాంత్, అమితాబ్ 33 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కన్నప్ప కనువిందు...

మంచు విష్ణు నటిస్తున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. ఇందులో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ సహా పలువురు తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను కేన్స్ చిత్రోత్సవంలో విడుదల చేయడం విశేషం. డిసెంబర్ 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోరాట యోధుడి పాత్రలో...

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా.. నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. నవంబర్ 14న దాదాపు పది




భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో సూర్యకు పాన్ ఇండియా గుర్తింపు ఖాయం అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

గోపీచంద్ విశ్వం

గోపీచంద్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న గోపీచంద్‌కు, శ్రీనువైట్లకు ఈ సినిమా రిజల్ట్ కీలకం కానుంది. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

గేట్లు లీకులు.. రైతులకు పాట్లు

- అస్తవ్యస్తంగా మారిన ఆధునికీకరణ పనులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ఇదీ మడ్డువలస రిజర్వాయర్ పరిస్థితి


మడ్డువలస గేట్ల నుంచి నీరు లీకవుతున్న దృశ్యం

వంగర: మడ్డువలస రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానంగా గేట్లు లీకులు కావడంతో నీరు వృథాగా పోతోంది. ఈ నేపథ్యంలో శివారు ఆయ కట్టుకు నీరందక రైతులు పాట్లు పడుతున్నారు.

పర్యవేక్షణ లేక..

వైసీపీ ప్రభుత్వం రూ.18 కోట్లతో మడ్డువలస రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టింది. అప్పట్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. ఈనేపథ్యంలో పనులు అస్తవ్యస్తంగా జరిగాయి. ప్రధానంగా ఆరు గేట్ల నుంచి నీరు పెద్దమొత్తంలో లీకవుతోంది. గేట్లు పనులు పూర్తిచేశామని అధికారులు చెబుతున్నా లీకులు మాత్రం యథాతథంగా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 11 గేట్లకు కొత్తరోప్‌లు, రబ్బరు సీళ్ల లైటింగ్ ఏర్పాటుచేయడంతోపాటు ఇతర పనులు పూర్తిచేయాల్సిఉంది. అయితే ఇంతవరకూ ఎంతమేర పనులు పూర్తిచేశారో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు.

నాగావళిలోకి 30 క్యూసెక్కులు..

ఆగస్టు నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో జలాశయంలోకి వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు కాగా నిర్వాసితుల సమస్యల వల్ల 64.050 మీటర్లకు స్థిరీకరించామని, ఈ మేరకు నీరు రిజర్వాయర్‌లో మూడు టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గేట్లు నుంచి ప్రతిరోజూ 30 క్యూసెక్కుల నీరు వరకు నాగావళి నదిలోకి వెళ్లిపోతోంది. నీరు వృథా అవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అయితే ఈ ఏడాది రిజర్వాయర్‌లో నీరు ఉన్నా ఆయకట్టుకు ఎందుకు నీరివ్వడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

గేట్లు మరమ్మతులు జరగాల్సి ఉంది..

గేట్లు మరమ్మతులు కొంత జరగాల్సి ఉందని ప్రాజెక్టు ఈఈ అర్జున్ తెలిపారు. అన్నిగేట్లకు రోప్‌లు అమర్చామని, కొన్నింటికి సీళ్ల వేయాల్సి ఉందని చెప్పారు. ఖరీఫ్‌లో నీరు విడుదల వల్ల కొన్ని పనులు నిలిపివేశామని తెలిపారు. కాలువద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో జోడెద్దులు మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని కొత్తపెంటలో విద్యుదాఘాతానికి గురై జోడెద్దులు మృతిచెందాయి.గ్రామస్థులు, బాధిత రైతు కథనం మేరకు.. కొత్తపెంటలో శుక్రవారం గ్రామానికి చెందిన బేతనపల్లి తిరుపతిరావు తమ పొలంలోకి ఎద్దుల బండితో వెళ్తున్నాడు. అదేగ్రామానికి చెందిన బేతనపల్లి బలరాం పొలంలోగల వ్యవసాయ పంపు సెట్టుకు సంబంధించిన ఎల్‌టీ వైరుతెగి పొలంలో పడడంతో రెండు ఎద్దులకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతిచెందాయి. విద్యుత్‌తీగ తెగిన విషయాన్ని గ్రహించి బండిపై నుంచి పక్క పొలంలోకి దూకడంతో రైతు తిరుపతిరావుకు గాయాలయ్యాయి. తిరుపతిరావును బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి గ్రామస్థులు తరలించారు. కాగా విద్యుత్ ప్రమాదంలో ఎద్దులు మరణించిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం కోరారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

లక్కవరపుకోట (వేపాడ): వేపాడ మండలంలోని వావిలపాడులో అక్రమంగా నిల్వఉంచిన ఆరు మద్యం సీసాలను ఎస్ఐ దేవి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సిబ్బందితో శుక్రవారం దాడిచేశారు. సీసాలు నిల్వచేసిన మహిళను అరెస్టుచేసి కేసు నమోదుచేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

సంతకవిటి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాకర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. రేగిడి ఆమదాలవలస మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకును తరలిస్తుండగా పొనుగుటివలస జంక్షన్ సమీపంలో ట్రాక్టర్లను ఆపి అనుమతిపత్రాలు తనిఖీచేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో పట్టుకుని సంతకవిటి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

జన్నివలస వంతెన వద్ద..

జామి: జన్నివలస వంతెన కింద తవ్వకాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. శుక్రవారం వంతెన కింద ఇసుక తవ్వుతుండగా ట్రాక్టర్‌ను జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు సాయంతో జామి పోలీసులు పట్టుకున్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

- కొమిరి గ్రామస్థుల నిరసన


కొమిరిలో ఇసుక లారీ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

రేగిడి: కె.వెంకటాపురం అనధికారి రీచ్ నుంచి వస్తున్న ఇసుకలారీలను నియంత్రించాలని కొమిరి గ్రామస్థులు కోరారు. శుక్రవారం ఇసుకలారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకలారీల వల్ల గ్రామంలో రోడ్లు, వంతెనలు పాడవుతున్నాయని, రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దు

విజయనగరం క్రైం: మద్యం సేవించి వాహనం నడిపేవారిపై చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.ఈ మేరకు విజయనగరంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు లోవరాజు, మహేశ్వరరాజు, చిన్నారావు తనిఖీలు చేపట్టి 23 మందిపై డ్రింక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రూ.లక్షా 20 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారని ఎస్పీ పేర్కొన్నారు. కాగా మద్యం సేవించి పట్టుబడిన వారికి సూరినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం విజయనగరంలోని తన కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డే కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. వేల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది అందించిన వ్యక్తిగత, వృత్తి, శాఖపరమైన వినతులు పరిష్కరిస్తామని తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్‌బీ సీఐలు

ఎస్పీ వకుల్ జిందాల్‌ను స్పెషల్ బ్రాంచ్-1 సీఐగా ఏవీ లీలారావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ-2గా బాధ్యతలు చేపట్టిన ఆర్‌వీఆర్‌కే చౌదరి కలిశారు. స్పెషల్‌బ్రాంచ్‌లో సిబ్బందిని అప్రమత్తంచేసి కీలకమైన సమాచారాన్ని సేకరించాలని కోరారు.

వ్యాపారులతో రైతుల వాగ్వాదం


ఎస్ఐతో మాట్లాడుతున్న రైతులు, వ్యాపారులు

బొబ్బిలి: బొబ్బిలి శ్రీలక్ష్మీ శ్రీనివాస జూట్‌మిల్లును నేల మట్టం చేసి ఇక్కడి ఏడెకరాల భూములు రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు యాజమాన్యం విక్రయించింది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన వ్యాపారులుతాము కొనుగోలు చేసిన భూముల్లో ప్రహరీ నిర్మాణం, భూమి చదునుచేశారు. వైసీపీ కౌన్సిలరు పాలవలస ఉమాశంకర్ ఆయన బంధువులు మురళి తదితరులు, పారాదికి చెందిన రైతులు ధనుంజయ్ కలిసి జూట్ మిల్లు భూముల్లో తమకు చెందిన భూములు ఉన్నాయని వాగ్వాదానికి దిగారు.ఈసందర్భంగా పనులను అడ్డుకున్నారు. దీనిపై కోర్టునుంచి ఇంజక్షన్ ఆర్డర్‌ను తెచ్చుకున్నామని చూపించారు.దీంతోవ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఎం.రమేష్ సిబ్బందితో సహా అక్కడికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

విజయనగరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఆయా శాఖల్లో విధులు సమగ్రంగా నిర్వహించి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించేందుకు తోడ్పడాలని కలెక్టర్ బీఆర్‌అంబేద్కర్ సూచించారు. శుక్రవారం గనులశాఖ డీడీగా ఈ.నర్సింహారెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ డీసీగా బాబ్జీరావు, అదే శాఖ సూపరింటెండెంట్‌గా బి.శ్రీనాథుడు, డ్వామా పీడీగా ఈ.సందీప్ తమ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్‌ను కలిశారు.

బాలికల వసతిగృహం పరిశీలన

శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె. విజయ కల్యాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఫుడ్‌పాయిజినింగ్‌పై విద్యార్థినుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టామని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశామని చెప్పారు. అనంతరం స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి సబ్బవరపు వాణితో కలిసి ఉపకారాగారం పరిశీలించారు.


వసతిగృహంలో పరిశీలిస్తున్న విజయకల్యాణి

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: యూడీఐ పథకం కింద పునాది స్థాయి నుంచి శ్లాబ్ స్థాయి వరకు వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం ఎల్.కోటలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో వివిధ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పూర్తిచేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయకపోతే ఇళ్లను రద్దవుతాయని ఏఈ ఉమామహేశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఇళ్లు కట్టుకున్నవారికి వెంటనే పేమెంట్ అందజేస్తామని నిధులకు కొరతలేదని తెలి పారు.సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరావు, శేఖర్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

లక్కవరపుకోట: స్కూల్ గేమ్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం ఎల్.కోటలో ఐదు మండలాల క్రీడా కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తవలసలో ఈనెల 30, వచ్చేనెల ఒకటో తేదీన జరగనున్న నియోజకవర్గ స్థాయి ఆటలపోటీలకు సిద్ధంకావాలని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ ఏడు రకాల ఆటల పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు ఎస్.కోట నియోజకవర్గ నుంచి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల పనులు

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాంరూరల్: నియోజకవర్గ పరిధిలోని దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు రూ.4 కోట్లు అదనంగా విడుదల చేసినట్లు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. శుక్రవారం రాజాంలో రెండో విడత రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌రెడ్డి కాంట్రాక్టర్ల వ్యవస్థను నాశనం చేశారని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యేందుకు కారకుడయ్యారని ఆరోపించారు. జగన్‌రెడ్డి అనుసరించిన విధానాలతో విసిగిపోయి, ఆర్థికంగా ఇబ్బందులు పడి రాష్ట్రంలో 40 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గతంలో పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్‌కు అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే కూటమి ప్రభుత్వం రూ.6 కోట్లు బకాయిలు అందజేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాల కోసం ముఖ్యమంత్రి రూ.9 కోట్లు నిధులు విడుదల చేశారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాజాం-డోలపేట మధ్య గోతుల్లో పడి 200 మంది గాయపడ్డారని, ఐదుగురు మృతి చెందారని చెప్పారు.

దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న రామ్మూర్తి నాయుడు

రాజాం రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం రాజాం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఏళ్ల కోరడంతోపాటు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండాపోయిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నగరాభివృద్ధికి కృషి చేయాలి

- మునిసిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ రవీంద్ర


మాట్లాడుతున్న రవీంద్ర

రింగురోడ్డు: అన్ని విభాగాల సమన్వయంతో నగరాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మునిసిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్ర తెలిపారు. శుక్రవారం విజయనగరంలో నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్యతో కలిసి అధికారులతో సమీక్షించారు. విభాగాలు వారీగా చేపట్టాల్సిన ప్రాధాన్యత అంశాలను వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వసూళ్లను పెంచాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తిని ఆదేశించారు. సమావేశంలోని సహాయ కమిషనర్ తిరుమలరావు పాల్గొన్నారు.

అక్టోబరు 5లోగా డేటా అందించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న అంబేద్కర్

కలెక్టరేట్: వ్యవసాయ, రవాణా, అటవీ, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీరాజ్ ఆర్‌అండ్‌బీ, జలవనరులు తదితర శాఖల వద్ద ఉన్న డేటాను అక్టోబరు ఐదో తేదీలోగా సర్వే ఆఫ్ ఇండియా వారి కిట్ అందజేయాలని కలెక్టర్ అంబేద్కర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వే ఆఫ్ ఇండియా, తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో జియోస్పెసియల్ ప్రమోషన్ అండ్ డెవలపెమెంట్ కమిటీపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఐఐటీ తిరుపతి సీఈవో రాజేంద్రన్ పవర్‌పాయింట్ ద్వారా డేటాపై వివరించారు. సర్వే ఆఫ్ ఇండియా ద్వారా డేటాను తీసుకుని ఆయాశాఖల సమస్యలకు సరైన పరిష్కారం కనుగొ నడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, ప్రొఫెసర్ అభిజిత్, డైరెక్టర్ ఆఫ్ జియో స్పేస్ ఫరీదా, సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కలిశెట్టి


సీఎంకు సమస్యలను వివరిస్తున్న కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం లోక్‌సభ నియోజకవర్గంపరిధిలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల సంభవించిన నష్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సీఎంతో చర్చించారు.

భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలి

- సెంచూరియన్ వర్సిటీలో వికసిత్ భారత్‌పై సదస్సు ప్రారంభం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యావేత్తలు, పరిశోధకులు

పర్లాకిమిడి: భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పర్లాకిమిడిలోని సెంచూ రియన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి వచ్చిన విద్యావేత్తలు మాట్లాడారు. ఇన్నోవేటివ్ బిజినెస్, అగ్రికల్చర్, టెక్నాలజీ ఆఫ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్‌పై వర్చువల్ మాధ్యమం ద్వారా వికసిత్ భారత్-2047 విజన్‌కు సహకరించాలని కోరారు. నేషనల్ ఇన్నర్వేటివ్ సెంటర్ మాజీ డైరెక్టర్ జనరల్, ప్రొఫెసర్ మోనిమాడస్వామి, మోనాస్ యూనివర్శిటీ (మలేసియా) ప్రొఫెసర్ వి.మోహనర్ ఆవారి, వెస్టర్న్ సిడ్నీ విద్య విద్యాలయం (ఆస్ట్రేలియా)కి చెందిన ప్రొఫెసర్ అతుల్‌జినిజ్ వివిధ అంశాలను వివరించారు. ప్రపంచంలోని ప్రధాన సంస్థలు, విద్యార్థులు 160పైగా పరిశోధన పత్రాలు తయారుచేసి అందించారు. వికసిత్ భారత్‌పై సావనీర్‌ను విడుదల చేశారు. ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో సెంచూరియన్ విశ్వవిద్యాలయం డీన్, ప్రొఫెసర్లు అనితపాత్రో, రవినారాయణ, ప్రజ్ఞ, వీసీ సుప్రియపట్నాయక్,ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, యూఏఈ, యూకేలతో పాటు 15 దేశాల విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయం

- రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్


మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

రాజాం/రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాజాం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించాయి.ఈ సందర్భంగా హెటిరో డ్రగ్స్, జస్ట్ డయల్, భారత్ ఫైనాన్స్ ఇన్క్లూషన్ లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ తదితర సంస్థలు పాల్గొనగా 226 మంది అభ్యర్థులు హాజరుకాగా 74 మందిని పలు కంపెనీలు ఎంపికచేశాయి. కార్యక్రమంలో భాస్కరరావు, యశ్వంత్‌బాబు, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

●**రాజాం:** రాజాంలోని జీసీఎస్ఆర్ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్ స్క్వేర్ టెక్నా లజీ క్యాంపస్ డ్రైవ్‌లో 40 మంది విద్యార్థులు నాలుగు నుంచి ఆరు లక్షలు వార్షికవేతనంతో ఉద్యోగం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎంఎస్ స్క్వేర్ టెక్నాలజీ సంస్థ హెచ్ఆర్ ప్రతినిధి సంతోష్ పేర్కొన్నారు.

నేడు భవన యజమానులతో సమావేశం

రాజాం రూరల్: రాజాంలో రెండోవిడత విస్తరణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో భవనాలు, ఇతర ఆస్తులకు నష్టంకలగనున్న యజమానులతో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు రాజాం మునిసిపల్ కమిషనర్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్‌లో అంబేద్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్‌ఐటీ మెయిన్‌గేటు, చీపురుపల్లి రోడ్‌లో బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రి కాలనీ వరకూ ఆస్తులు కోల్పోతున్న యజమానులు, సమస్యలు ఉన్న ప్రజలు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి దర్శనాలు నిలిపివేత

రాజాం రూరల్: పట్టణంలోని నవదుర్గ ఆలయంలో గల నవదుర్గ అమ్మవారి మూలవిరాట్‌తో పాటు జ్ఞాన సరస్వతి అమ్మవార్ల దర్శనాన్ని శనివారం నుంచి ఐదు రోజుల పాటు నిలిపివేయనున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ చేపట్టనున్న నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు, వంశ పారంపర్య ధర్మకర్తల కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. సంప్రోక్షణ, పెయింటింగ్ తదితర పనుల అనంతరం అక్టోబరు మూడో తేదీ నుంచి అమ్మవారి దర్శనాలను పునరుద్ధరించనున్నారు.మూడోతేదీ నుంచి నవరాత్రి భవానీ భక్తులనవరాత్రి దీక్షలు ప్రారంభంకానున్నాయి.

రేపు అబాకస్ లెక్కలపై అవగాహన

బొబ్బిలి: బొబ్బిలి శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం యూసీమాస్ (అబాకస్) లెక్కల కార్యక్రమంపై అవగాహన నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు ఎం.స్వప్న మోహన్ తెలిపారు. డెమోఅనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా అవార్డుల ప్రదానంచేస్తామని పేర్కొన్నారు.

పారా వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం రూరల్: పారా వలంటీర్లగా పనిచేసేందుకు ఆసక్తిగల వారు వచ్చేనెల ఎనిమిదో తేదీలోగా రాజాంలోని కోర్టు ప్రాంగణంలో దరఖాస్తులు అందజేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని ఉద్యోగ విరమణ పొందిన వారితోపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు దరఖాస్తుచేసుకు నేందుకు అర్హులని పేర్కొన్నారు. పారాలీగల్ వలంటీర్లగా నియమితులైన వారికి పారితోషికం, జీతభత్యాలు ఉండవని తెలిపారు.

రచయితకు సన్మానం

రాజాం: ప్రకృతి వ్యవసాయ పాఠ్యాంశాల రచయిత పెంకిగౌరీశ్వరరావును శుక్రవారం తోటపల్లి జట్టు సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. నాబార్డు డీడీఎం పి.దినేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు, విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై గౌరీశ్వరరావు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

బొబ్బిలిలో ప్రాయశ్చిత్త హోమం


హోమం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

బొబ్బిలి: తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ కావడంతో బొబ్బిలిలో జనసేన రాష్ట్ర కార్య నిర్వాహకకార్యదర్శి పాలూరు బాబు దంపతుల ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు పాల్గొన్నారు.

ఎరువులు అందజేయాలి

జామి: వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు అందజేయాలని విజినిగిరి రైతులు, ఉపసర్పంచ్ సత్యనారాయణ కోరారు. విజినిగిరిలో జరిగిన గ్రామసభలో ఎరువులపై అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల యూరియా గొడౌన్‌కు పరిమితమయ్యిందని తెలిపారు. ఎరువుల కోసం గ్రామసభలో అధికారులను నిలదీశారు. కాగా గ్రామంలో ఈ-కేవైసీ చేయిస్తున్నామని, రెండురోజుల్లో పూర్తిచేశాక ఇద్దామని యూరియా పంపిణీ చేయలేదని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు.

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలిబాలికల జట్లు

విజయనగరం టౌన్: విజయనగరంలోని స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు ఆధ్వర్యంలో అండర్- 14, అండర్- 17 టేబుల్ టెన్నిస్ బాల బాలిక జిల్లా జట్లను శుక్రవారంఎంపికచేశారు. ఎంపికైన జట్ల క్రీడాకారులు నంద్యాలలో నిర్వహించేపోటీల్లో పాల్గొంటారని కృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో సన్యాసిరాజు, వ్యాయామఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నుంచి జరగనున్న బాల బాలికల అండర్- 17 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లా జట్లు శుక్రవారం పయనమయ్యాయి.కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు సాహితీవేత్త

లక్కవరపుకోట: రాజమండ్రిలో శనివారం జరగనున్న జాతీయ సదస్సులో పాల్గొనాలని పిలుపు వచ్చినట్లు కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీ వేత్త కిలారి గౌరినాయుడు గౌరినాయుడు తెలిపారు. నన్నయ్య విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం సంయుక్తంగా సదస్సు నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు.

పాఠశాలను పునరుద్ధరించాలి

- సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌ల భర్తలు హాజరు

బాడంగి: ఎరుకుల పాకలో పాఠశాలను పునరుద్ధరించాలని గజరాయనివలస ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలవలస గౌరి మాట్లాడుతూ జాతీయ రహదారి దాటుకుని ఎరుకుల పాకలో స్కూల్‌కు 16 మంది విద్యార్థులు వెళ్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వాడాడ సర్పంచ్, ఎంపీటీసీలకు బదులుగా వారి భర్తలు పూడి సూర్యనారాయణ, రెడ్డి త్రినాథ వ్యవసాయ, విద్యుత్‌శాఖాధికారులను నిలదీశారు. సగానికి పైగా మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు బదులు కుటుంబ సభ్యులు హాజరుకావడం విశేషం.సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ఎంపీటీసీ, సర్పంచ్‌ల కుటుంబ సభ్యులు

చెత్త సంపదపై చిత్తశుద్ధి ఏదీ?

- శిథిలమైన మోడ్రన్ ఎస్‌డబ్ల్యూపీసీ
- మూలకు చేరిన విలువైన యంత్రాలు

(జియ్యమ్మవలస)

చెత్త నుంచి సంపద సృష్టించి, పంచాయతీకు ఆదాయం సమకూర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి.. ఈమేరకు చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల నియమించారు. పవర్ ఆటోలు, చెత్తను తీసుకెళ్లే తొట్టె రిక్షాలు, ఇళ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్తను సేకరించేందుకు డస్ట్‌బిన్లు సమకూర్చారు. చెత్తను ఒక చోట డంప్ చేసేందుకు వీలుగా తొట్టెలు నిర్మించారు. కావల్సిన మిషన్లు ఇచ్చి వాటిని వినియోగించేందుకు అవసరమైన తర్ఫీదును ఇప్పించారు. అంతా బాగానే ఉంది కానీ వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని గత ఐదున్నరేళ్లుగా వాటికి అతీగతీ లేకుండా పోయింది. వేసిన షెడ్లన్నీ చాలా చోట్ల శిథిలమైపోగా నియోజకవర్గానికే తలమానికంగా తీర్చిదిద్దుతామన్న మోడ్రన్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కూడా పూర్తిగా శిథిలమయిపోయింది. గడ్డితో వేసిన పైకప్పు నాలుగేళ్ల కిందట తుఫాన్‌కు ఎగిరిపోయింది. ఇక్కడ లక్షలాది రూపాయలు విలువ చేసే సంపద తయారీ కేంద్ర మిషన్లు తుప్పు పట్టి నిరుపయోగంగా ఉన్నాయి. 2014-19 మధ్య కాలంలో సర్పంచ్‌గా గుణుపూరు పార్వతమ్మ ఉన్న సమయంలో ఈ ప్రాంగణం చాలా అందంగా ఉండేది. మోడ్రన్ కేంద్రంగా తీర్చి దిద్దడంలో భాగంగా కడియం నుంచి రకరకాల పండ్ల మొక్కలు, పూల మొక్కలు తెచ్చి నాటారు. అప్పుడే ఈ యంత్రాలను తెచ్చి ప్రాజెక్టుకు ఊపందించారు. కానీ ఇప్పుడు వీటికి అతీగతీ లేకుండాపోయింది. చెత్త నుంచి సంపద తయారీలు లేవు. అసలు పట్టించుకునే నాథుడే లేకుండాపో యారు. దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా యంత్రాలు

కలెక్టర్ దృష్టిలో పెట్టాం

మోడ్రన్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం విషయమై ఇటీవలే రిటైర్డ్ డీపీవో బలివాడ సత్యనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. ఒకట్రెండు రోజుల్లో కదలిక రావచ్చు అని భావిస్తున్నాం.

- కె.రామారావు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్, జియ్యమ్మవలస



షెడ్డుపై కప్పు లేని దృశ్యం

బిల్లులు.. కార్మికుల జీతాలు షరామామూలే

విచిత్రం ఏమిటంటే ఏడేళ్ల కిందట ఇక్కడ వేసిన బోరు పనిచేస్తూనే ఉంది. బోరుకు సంబంధించి మీటరుకు పంచాయతీ తరఫున బిల్లులు కడుతూనే ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు నెల నెల జీతాలు వస్తున్నాయి కూడా. కానీ ఇక్కడ మాత్రం ఎటువంటి సంపద సృష్టి జరగడం లేదు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పిల్లలకు అన్నం వడ్డిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీతంపేట ఏజెన్సీలో పర్యటించిన ఆయన మండ గ్రామంలోని వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో గిరిజన మహిళలు తయారు చేసే కొండచీపుర్లను పరిశీలించి మార్కెట్ ధర, చీపురు నాణ్యత వంటి అంశాలపై సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని రుచి చూశారు. కలెక్టరే స్వయంగా చిన్నారులకు వడ్డించి వారితో ముచ్చటించారు. కూటమి నాయకులు సవరతోట మొఖలింగం, హెచ్ ప్రసాదరావు, ఐటీడీపీ కోఆర్డినేటర్ పవన్, సవర మాలయ్య, బి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈ సింహాచలం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈవో జి.పగడాలమ్మ, డీడీ అన్నదొర, పీహెచ్‌వో వెంకటగణేష్, డిప్యూటీ డీఈవో పి.నారాయడు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, టూరిజం అధికారి నారాయణ రావు, ఏఎంవో కోటిబాబు, డీపీవో సతీష్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

జియ్యమ్మవలస: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు తుమ్మిగూడ, సీమలవానివలస పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తర్వాత ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్‌లు, టీచర్ డైరీలను పరిశీలించారు. తరువాత తుమ్మిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు గతంలో కంటే మెరుగయ్యాయని, మరింత తర్ఫీదు ఇవ్వాలని హెచ్ఎం జ్యోనేసును ఆదేశించారు. సీమలవానివలస పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అల్లు రవిప్రసాదరావు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీవోఏలు

బెలగాం: క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకురాలు ఇందిరా మాట్లాడుతూ వీవోఏలకు రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటున్నాయని, వారిపై రాజకీయ కక్షలు ఆపాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇటీవలె అకారణంగా తొలగించిన జియ్యమ్మవలసకు చెందిన తొమ్మిది మంది వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ నాయకులు, పెద్ద సంఖ్యలో వీవోఏలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శుక్రవారం అక్రమంగా రవాణా చేస్తున్న కేజీ గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా ప్రాంతం సుంకి నుంచి శ్రీకాకుళానికి తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. ఈ మేరకు శ్రీకాకుళానికి చెందిన అనిల్, భరత్ అనే యువకులపై కేసు నమోదు చేసి, బైకు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వెంకట సురేష్ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పూర్వ వైభవం తీసుకొస్తా

- సాలూరు మున్సిపల్ నూతన కమిషనర్ సత్యనారాయణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

సాలూరు రూరల్: సాలూరు మున్సిపాలిటీకి నెల రోజుల్లో పూర్వ వైభవాన్ని తీసుకు రావడానికి శాయశక్తుల కృషి చేస్తానని మున్సిపల్ నూతన కమిషనర్ సీహెచ్ సత్యనా రాయణ అన్నారు. బొబ్బిలి డెవలప్ మెంట్ అథారిటీ పరిపాలనాధికారి గా చేస్తున్న ఆయన సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. శానిటరీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని పట్టణంలో పారిశుధ్య పరిస్థితిని పూర్తి స్థాయిలో మెరుగుపరుస్తానన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్మికుల సహకారంతో నెల రోజుల్లో పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. ఆదాయం పెంచడానికి అన్ని మార్గాలను వినియోగిస్తామన్నారు. రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, పాలకవర్గం, ప్రజల సహకారంతో సాలూరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అన్నదానానికి దాతల సాయం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలకు వచ్చే భక్తులకు ఉచిత అన్నసమారాధనకు పలువురు దాతలు సహకారం అందిస్తున్నారు. శుక్రవారం తోటపల్లికి చెందిన విశ్రాంత ఆర్ఐ మార్కొండ వాసుదేవరావు రూ.10 వేలు విరాళంగా అందించారు. అలాగే శాశ్వత అన్నదానానికి ఈయనతో పాటు పార్వతీపురానికి చెందిన డాక్టర్ ఎం.శ్రీరాములు రూ.20వేలు, విశ్రాంత డీఎస్పీ (విశాఖపట్నం) ఎల్వీ శ్రీనివాసరావు రూ.10వేలు, గుమ్మలక్ష్మీపురానికి చెందిన జగన్నాథ రథో రూ.20 వేలు, వీరఘట్టానికి చెందిన భోగి కృష్ణ చైతన్య రూ.10 వేలు అందించారు.

యువతి అదృశ్యం

సీతానగరం: యువతి అదృశ్యంపై సీతానగరం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయ్యింది. మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన కె.వసంత (17) గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి పిన్నిగారింటికి వెళ్తానని చెప్పి ఇంతవరకు ఇంటికి రాలేదని తల్లి కందిశ పార్వతి శుక్రవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గరుగుబిల్లి: తల్లీ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రావుపల్లి గ్రామంలో శుక్రవారం పోషకాహార ప్రదర్శనతో పాటు గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● **మక్కువ:** సరాయివలస అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, సర్పంచ్ మోహిని, టీడీపీ నాయకులు నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గజలక్ష్మి పూజలకు శుభరాట

ఒడిశా

రాయగడ: వచ్చే నెల పదో తేదీ నుంచి 27వరకు నిర్వహించనున్న గజలక్ష్మీ అమ్మవారి పూజల కోసం శుక్రవారం స్థానిక న్యూకాలనీలో పూజా మండపం వద్ద శుభరాట వేశారు. ఈ కార్యక్రమాన్ని సురేష్‌చంద్ర సామంత్రాయ్(లుల్లు), పూజారి ప్రబీర్ మహారాజ్ నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, ప్రజల సహకారంతో గత 28 సంవత్సరాలుగా గజలక్ష్మి అమ్మవారి పూజలు నిర్వహిస్తున్నామని ఈ ఏడాది ఇంకా వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించామని అందులో భాగంగా శుభరాట వేసినట్టు తెలిపారు. మీనా బజారులో వివిధ సంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో త్రినాథరావు, సవ్యసాచి సహు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం

- ఆలయాల్లో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేలు



గరుగుబిల్లి: తోటపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



సీతంపేట రూరల్: వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్: ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన పరిణామాలపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా సీతంపేటలోని వేంకటేశ్వర ఆలయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సంఘీభావ దీక్షలో కూటమి నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి, గర్భాణ సత్తిబాబు, హెచ్.ప్రసాదరావు, ఐటీడీపీ కోఆర్డినేటర్ పవన్, సంజ్ఞ, కె.రాజేష్, ఎస్.మాలయ్య, కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** భక్తులను మోసగించిన వారికి తగిన శిక్ష తప్పదని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శుక్రవారం తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక సంప్రోక్షణ చేపట్టారు. తిరుపతి లడ్డూలకు కల్తీ నెయ్యి కలపడం విచారకరమన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, మరడాన సింహాచలం, ఎం.నారాయణస్వామి, నల్ల తిరుపతి రావు, ఎం.పకీరునాయుడు, పువ్వల లావణ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇవ్వండి

పార్వతీపురం రూరల్: దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని నెల్లూరులోని తన నివాసంలో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర శుక్రవారం కలిశారు. మండలంలోని పెదబొండపల్లెలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే అనుమతులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాను కూడా దేవస్థాన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతానని మంత్రి తెలిపారు. దీనిపై టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బోను దేవిచంద్రమౌళి, జి.చంద్రమౌళి, పార్టీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు హర్షం వ్యక్తం చేశారు.

ఓటర్లుగా నమోదు కావాలి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్

కురుపాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్, జిల్లా జనరల్ సెక్రటరీ నల్లా బాలకృష్ణ కోరారు. కురుపాం, శివన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయనతో పాటు జిల్లా జనరల్ సెక్రటరీ నల్లా బాలకృష్ణ, ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరు నమోదు దరఖాస్తులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు మజ్జి ఉపేంద్ర, ఆకుల జగదీశ్వరరావు, వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

వీరఘట్టం: మండలంలోని యూటీఎఫ్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు కోరారు. శుక్రవారం వండువ జడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉన్నత పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని నియమించాలని, కేజీబీవీ సిబ్బందికి ఎంటీఎస్‌ను వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోనంగ దుర్గా ప్రసాద్, కురమాన గోవిందరావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతోనే అధిక లాభాలు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి సాగుతోనే అధిక లాభాలు సాధించవచ్చునని ఉత్తర కోస్తా రీజనల్ మోడల్ మండల యాంకర్ కె.రమప్రభ అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉండేటట్టు సబ్ కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని పాఠశాలల్లో ఖాళీ స్థలంలో పలు పంటలు వేయాలని సూచించారు. వెలుగు ఏపీఎం ఆదెయ్య మాట్లాడుతూ సంఘ సభ్యులు ప్రతిఒక్కరూ తమ పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మోడల్ మండల యాంకర్ గణేష్‌శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పట్టాలెక్కిన ట్రాక్టర్



పట్టాలపై నడుస్తున్న ట్రాక్టర్

సీతానగరం: పార్వతీపురం నుంచి సీతానగరం మధ్యలో చేపడుతున్న రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా పట్టాలకు ఇరువైపులా రాళ్లు వేసేందుకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్‌కు టైర్లు తొలగించి పట్టాలపై నడిచేందుకు వీలుగా ఇనుప చక్రాలను అమర్చారు. నిల్వ ఉన్న రాళ్లను జేసీబీ ద్వారా నింపి ఇరువైపులా వేయడానికి ఉపయోగిస్తున్నారు.

గుంతలు పూడ్చివేత

పాలకొండ: పట్టణంలోని ఎన్‌కే రాజపురం జంక్షన్ వద్ద రహదారి పూర్తిగా శిథిలమై గోతులమయంగా మారింది. దీనిపై ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ రోడ్డులో గుంతలను పూడ్చివేశారు.

విజన్-2047కు సహకరించాలి

సాలూరు రూరల్: విజన్-2047 ప్రణాళికకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఖరాసవలస ఎంపీటీసీ సభ్యురాలు అప్పికొండ రమాదేవి అన్నారు. శుక్రవారం ఖరాసవలసలో ఉపసర్పంచ్ యుగంధర్ ఆధ్వర్యంలో పంచాయతీ ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి పర్యవేక్షణలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా స్వర్ణాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి మౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

వీరఘట్టం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందాలంటే ఏయే రంగాల్లో దృష్టి సారించాలని అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వ్యాసరచన, ఎల్లోకేషన్, డిబేట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన 9 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంఈవోలు భాస్కరరావు, ఆనందరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

వైసీపీకి బిగ్ షాక్

- జనసేనలో చేరిన సాలూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



జనసేన పార్టీ కండువాలతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సాలూరు రూరల్: సాలూరు మున్సిపాలిటీలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లతో పాటు పలువురు నాయకులు శుక్రవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ జిల్లా కార్యదర్శి జరజాపు సూర్యనారాయణ, సాలూరు అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జరజాపు ఈశ్వరరావు, సాలూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి, కౌన్సిలర్లు జరజాపు నీలిమ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, గొల్లపల్లి వరప్రసాద్‌లతో పాటు 11వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి సింహాచలం.. విశాఖలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈసందర్భంగా జరజాపు సూర్యనారాయణ మాట్లాడుతూ సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీ కాలం పువ్వల ఈశ్వరమ్మకు రెండున్నర సంవత్సరాలు, తమ కోడలు దీప్తికి రెండున్నర సంవత్సరాలు ఇవ్వడానికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జెంటిల్ ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఈ ఒప్పందాన్ని వైసీపీ అమలు చేయలేదన్నారు. తమకు, అనుచరులకు వైసీపీ చిన్నచూపు చూసిందన్నారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి తమను ఆకట్టుకున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో వైసీపీని వీడి జనసేనలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గురాన అయ్యాలు, మోహనరావు, తిరుపతిరావు, కాశీనాయుడు, తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వలు లేకుండా చూడాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో మురుగు నిల్వలు లేకుండా దృష్టి సారించాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని చినగుడబ, పెదగుడబ పంచాయతీల్లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నిల్వలు కారణంగానే దోమలు విజృంభణ అధికంగా ఉంటుందన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

గిరిజన ఆశ్రమ పాఠశాలలో క్రీడా పోటీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అండర్-14 బాల బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గిరిజన యువతీ యువకులు క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజ్, హెచ్ఎం నాగరాజు, తెలుగు మహిళా నాయకురాలు పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

650 మందికి వైద్య సేవలు

పార్వతీపురం రూరల్: డీకేపట్నం గ్రామ సచివాలయ ఆవరణలో పార్వతీపురం లయన్స్ క్లబ్ నేతృత్వంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పార్వతీపురంలో ప్రముఖ వైద్యులు, శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. పార్వతీపురం లయన్స్ అధ్యక్షుడు బీఎస్‌బీ రావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 650 మంది రోగులకు వైద్య సేవలు అందించి, సుమార లక్ష రూపాయల మందులు ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు భామినిలో వైద్య శిబిరం

భామిని: భామిని భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఈ ఉచిత వైద్య కేంద్రం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోండి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పార్వతీపురంటౌన్: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ దిశగా ముందుకు వెళ్లాలని ఆర్కే జనహిత కళాశాలల కరస్పాండెంట్ పూడి రామకృష్ణ అన్నారు. పట్టణంలోని జనహిత డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడారు. విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.